కేటీఆర్‌ను కలిసిన రాజుగౌడ్

కేటీఆర్‌తో మంతపురి రాజుగౌడ్

పాల్వంచ, నవంబర్ 20: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిస్థితుల గురించి కేటీఆర్‌కు వివరించారు. అయితే, కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీల అమలు, రైతుల సమస్యలపై ప్రజల నుంచి ఎలాంటి వ్యతిరేకత వ్యక్తమవుతుందో అనే అంశాల గురించి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

సామాజిక తనిఖీతో వెలుగులోకి అక్రమాలు

ఈజీఎస్ ఓపెన్‌ఫోరంలో మాట్లాడుతున్న అధికారులు

దుమ్ముగూడెం, నవంబర్ 20: లక్ష్మీనగరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామసభలో అక్రమాలు వెలుగు చూశాయి. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.8.22కోట్లతో 800 పనులు జరిగాయి. రూ.2,58,500 విలువైన పనుల్లో అవకతవకలు జరిగినట్లు డీఆర్‌డీవో అడిషనల్ పీడీ రవి తెలిపారు. ఈజీఎస్ సిబ్బంది నుంచి రూ.1,63,611ను తిరిగి వసూలు చేసినట్లు చెప్పారు. సంబంధిత సిబ్బందికి మెమో, షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనూష, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో ముత్యాలరావు, ఈజీఎస్ ఏపీవోలు సుకన్య, అంజిగౌడ్, కొమరయ్య, కుమార్, డీఆర్‌పీ, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, నవంబర్ 20: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వాముల వారికి అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

పర్ణశాలలో పునర్వసు కల్యాణం

పర్ణశాల, నవంబర్ 20: మాస నక్షత్రం సందర్భంగా పర్ణశాల దేవాలయంలో అర్చకులు బుధవారం పునర్వసు కల్యాణం నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

అశ్వాపురం, నవంబర్ 20: మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో మనుబోతులగూడెం గ్రామం ఉంది. కేసీఆర్ ప్రభుత్వంలో రోడ్డు మంజూరైనప్పటికీ అటవీ శాఖ నుంచి అనుమతులు రాలేదు. దీంతో రోడ్డు నిర్మాణం ఆగింది. అంతంత మాత్రంగా ఉన్న ఈ రోడ్డు.. ఇటీవలి వర్షాలకు పూర్తిగా దెబ్బతిని, గోతులమయంగా మారింది. దీనిని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో విసుగెత్తిన గ్రామస్తులు.. బుధవారం శ్రమదానంతో రోడ్డుపై గుంతలను పూడ్చారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తను తొలగించారు.

'ప్రాచీన ఆహార సంస్కృతి' పుస్తకావిష్కరణ

బూర్గంపహాడ్, నవంబర్ 20: జార్ఖండ్ రాష్ట్రం జంషెడ్‌పూర్‌లో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు బిర్సా ముండా జయంతి వేడుకలు జరిగాయి. 'కోయ ఆదివాసీ ప్రాచీన ఆహార సంస్కృతి' పుస్తకాన్ని టాటా స్టీల్ ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. దీనిని మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన పాయం రాజేంద్రప్రసాద్ రచించారు. ఆయనను పలువురు ప్రముఖులు అభినందించారు.

పర్ణశాల సీతమ్మకు బంగారు సూత్రాలు

మంగళసూత్రాలు విరాళంగా ఇస్తున్న భక్తులు

పర్ణశాల, నవంబర్ 20: పర్ణశాల సీతమ్మ వారికి భద్రాచలం వాస్తవ్యులైన పిన్నింటి రాజశేఖర్- కమల దంపతులు బుధవారం నాలుగు గ్రాములున్న రెండు బంగారు సూత్రాలను, భద్రాచలం మహిళా భక్త బృందం నాలుగు గ్రాములున్న మూడు బంగారు సూత్రాలను బుధవారం విరాళంగా అందించారు. వీటిని మూలమూర్తులకు, కల్యాణ మూర్తులకు ఉపయోగిస్తామని అధికారులు తెలిపారు. అర్చకులు శేసం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సీఎస్ఆర్ నిధులపై ఎమ్మెల్యేలు, పరిశ్రమల ప్రతినిధుల సమీక్షలో కలెక్టర్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులు అందజేసి అభివృద్ధి భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సీఎస్ఆర్ నిధుల అంశంపై ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్యలతోపాటు వివిధ పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లడారు. జిల్లాలో సామాజిక, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామన్నారు. ఇక్కడ ఉన్న సంస్థలు జిల్లా అభివృద్ధికి రెండు శాతం సీఎస్ఆర్ నిధులను తమవంతు బాధ్యతగా అందజేయాలని కోరారు. గతంలో సీఎస్ఆర్ నిధుల కింద జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రభావిత ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను విజయవంతంగా చేపట్టినట్లు గుర్తుచేశారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, నవభారత్, బీటీపీఎస్ సంస్థల ఉన్నతాధికారులు, ఇండస్ట్రీస్ జీఎం తిరుపతయ్య, సీపీవో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే కూనంనేని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొత్తగూడెం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం అర్బన్, నవంబర్ 20: గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా కొత్తగూడెం అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వారోత్సవాల సందర్భంగా జరిగిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు ప్రారంభం

కొత్తగూడెం ప్రగతి మైదానంలో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల జిల్లాస్థాయి ఆటల పోటీలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల' కృషి ఏఐటీయూసీదే: కూనంనేని

దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు అనుభవించే ప్రతి హక్కూ ఏఐటీయూసీ కృషి, పోరాట ఫలితమేనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం సింగరేణి రుద్రంపూర్ ఏరియా కమ్యూనిటీ హాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సభలో కూనంనేని మాట్లాడారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సాబీర్‌పాషా, బాలరాజు, సింగు నర్సింహారావు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ఇల్లెందు రూరల్, నవంబర్ 20: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ డాక్టర్ పి.విజయ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. అధ్యాపకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీదేవి, కృష్ణవేణి, డాక్టర్ రాకేష్ శ్రీరామ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన డీఎల్‌పీవో

వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లు

చుంచుపల్లి, నవంబర్ 20: మండలంలోని రుద్రంపూర్, దన్‌బాద్ పంచాయతీల్లో జరుగుతున్న ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) రమణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకూ తావులేకుండా సర్వే చేయాలని ఆదేశించారు.

'మాదక ద్రవ్యాలకు పిల్లలు దూరంగా ఉండాలి'

పాల్వంచ, నవంబర్ 20: మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు పిల్లలు దూరంగా ఉండాలని జిల్లా విద్యా శాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ సూచించారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా పాల్వంచ బొల్లోరిగూడెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత పిల్లలతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆయన మాట్లాడారు. పిల్లలు తమ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని, దాన్ని చేరుకునేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. అలాగే, పెద్దల పట్ల విధేయత కలిగి ఉండాలని, జీవితాన్ని సన్మార్గంలో నడిపించుకోవాలని సూచించారు. హెచ్ఎం మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల వినతులకు పరిష్కారం చూపాలి: కూనంనేని

పాల్వంచ, నవంబర్ 20: ప్రజల వినతులకు తక్షణమే పరిష్కారం చూపాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటలో బుధవారం పర్యటించిన ఆయన.. వివిధ శాఖల అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక సమస్యల గురించి అక్కడి ప్రజలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. అలాగే, అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇతర అధికారులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాణి తదితరులు పాల్గొన్నారు.

'పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది'

పాల్వంచ రూరల్, నవంబర్ 20: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని లక్ష్మీదేవిపల్లి (ఎస్) డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ పేర్కొన్నారు. అందుకని ప్రతి విద్యార్థీ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా ఇతర పుస్తకాలు, గ్రంథాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వార్తాపత్రికలను చదవడాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ జే.మాధవి, గ్రంథాలయ విభాగ అధిపతి డాక్టర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో జగన్నాథపురం విద్యార్థులకు బహుమతులు

పాల్వంచ రూరల్, నవంబర్ 20: అన్నపురెడ్డిపల్లిలో బుధవారం జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో పాల్వంచ మండలం జగన్నాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు బహుమతులు సాధించారు. ఎనిమిదో తరగతి విద్యార్థి బీ.విజయ్‌నాయక్ 'ప్రైమరీ సిస్టం ఇన్ వన్ ఫ్రేమ్' అనే ప్రాజెక్టును ప్రదర్శించి జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి సాధించాడు. తొమ్మిదో తరగతి విద్యార్థిని బీ.అక్షయ సీనియర్స్ విభాగంలో 'మెడిసినల్ ప్లాంట్స్' అనే ప్రాజెక్టును ప్రదర్శించి మొదటి బహుమతి పొందింది. వీరికి బీ.దుర్గా శైలజ, బీ.మాధవిలు గైడ్ టీచర్లుగా వ్యవహరించారు. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో రెండు బహుమతులు సాధించడం పట్ల ఎంఈవో శ్రీరామ్మూర్తి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను, గైడ్ టీచర్లను అభినందించారు.

సైకిళ్లు, తోపుడు బండ్లు పంపిణీ

బూర్గంపహాడ్, నవంబర్ 20: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు పదిమందికి సైకిళ్లను, రోడ్లపై చిరువ్యాపారం చేసుకునే నిరుపేదలకు తోపుడు బండ్లను, ఐదుగురు దివ్యాంగులకు వీల్ చైర్లను రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ (భద్రాచలం) సమకూర్చింది. వీటిని బుధవారం పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ అధ్యక్షుడు మడిపెద్ది రమేష్‌ను, సహకారం అందిస్తున్న బూసిరెడ్డి శంకర్‌రెడ్డిని డీఎస్పీ అభినందించారు. ప్రోగ్రాం చైర్మన్ బాచిన రామకృష్ణ, క్లబ్ కార్యదర్శి గంజి సంపత్, కోశాధికారి ధనకొండ రాఘవయ్య, పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపహాడ్ ఎస్సై రాజేష్, ఎంఈవో యదుసింహరాజు పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత

టేకులపల్లి, నవంబర్ 20: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బుధవారం దాడులు నిర్వహించింది. ఎస్సై గౌతమ్ తెలిపిన వివరాలు.. వాగొడ్డుతండా, లచ్చతండా, ఏ కాలనీ తండా, బీ కాలనీ తండా, చంద్రుతండా, శంభునిగూడెం గ్రామాల్లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం దాడులు నిర్వహించి, ఏడు లీటర్ల నాటు సారాను స్వాధీనపర్చుకుంది. ఇద్దరిపై కేసు నమోదు చేసింది. దాడుల్లో ఎస్సై గౌతమ్, సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, నవంబర్ 20: మండలంలోని మద్రాస్ తండా గ్రామంలోని బానోత్ రాంబాబు ఇంటి నుంచి 2.5 లీటర్ల నాటు సారాను ఎస్సై పోగుల సురేష్ బుధవారం స్వాధీనపర్చుకున్నారు. రాంబాబుపై కేసు నమోదు చేశారు.

తహసీల్దారుకు వినతి

అశ్వాపురం, నవంబర్ 20: ఏజెన్సీలోని ఎస్సీలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అమలు చేయాలని కోరుతూ బుధవారం షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి నాయకులు తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం సమర్పించారు. బొమ్మెర శ్రీనివాస్, ఎనగంటి కృపాకర్, నీలం పార్వతి, దర్శనాల నర్సింహారావు, కొమ్మెర పవన్ కల్యాణ్, చీకటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు రేపటి నుంచి కోచింగ్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 20: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఈ నెల 22 నుంచి ఐదు రోజుల పాటు కొత్తగూడెం ప్రగతి మైదానంలో శిక్షణ ఉంటుందని డీఈవో వెంకటేశ్వరచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనే క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నవీన్‌కుమార్ తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్-17 బాలుర రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసిన విషయం విదితమే. ఎంపికైన తెలంగాణ రాష్ట్ర జట్టు ఈ నెల 30 నుంచి డిసెంబర్ 6 వరకు జమ్మూకశ్మీర్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. అయితే, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టులో వివిధ జిల్లాల క్రీడాకారులు ఉండడంతో జట్టు సమన్వయం కోసం కొత్తగూడెంలో కోచింగ్ ఇస్తున్నారు.

విద్యార్థులు మొబైల్‌ను వినియోగించొద్దు: ఎస్ఐ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 20: మొబైల్ వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని టూటౌన్ ఎస్సై షాహినా సూచించారు. 'మాదక ద్రవ్యాలు - మొబైల్ వినియోగం - సైబర్ నేరాలు' అనే అంశంపై రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు బుధవారం ఆమె అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మనిషి జీవితంలో అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని వివరించారు. ఎక్కడైనా సైబర్ నేరాలు జరిగే తక్షణమే 100గానీ లేదా 1930కి గానీ డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. హెచ్‌సీలు వెంకటేశ్వరరావు, బుచ్చి రాములు, శ్రీరాములు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కోసం ముఖాముఖి

ముఖాముఖి నిర్వహిస్తున్న అధికారులు

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 20: సింగరేణిలో కారుణ్య నికామ కాల కోసం హెడ్డాఫీస్‌లో బుధవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి కార్పొరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన కార్మికులు కొందరు.. తమ ఉద్యోగాన్ని కారుణ్య నియామకాల ద్వారా తమ వారసులకు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. దీంతో నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జీఎం పర్సనల్ కే.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ముఖాముఖి నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, సాక్షుల సమక్షంలో వారసుల వివరాలను నమోదు చేశారు. డీవైపీఎం కిరణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ స్వప్నిల్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్‌రెడ్డి

పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

పాల్వంచ, నవంబర్ 20: ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ యుగంధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా కాశీ హుస్సేన్ ఎన్నికయ్యారు. మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. పాల్వంచలోని మినీ స్టేడియంలో బుధవారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో వీరిని ఎన్నుకున్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యుడు అనుదీప్, రాష్ట్ర క్రీడా విభాగ సభ్యురాలు సింధు తపస్వి పరిశీలకులుగా హాజరైన ఈ కార్యక్రమంలో కే.మహేందర్, ప్రేమ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మొగిలి, నాగేందర్, రమేశ్, భూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆర్థిక యాజమాన్యం అవసరం

మాట్లాడుతున్న డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేట, నవంబర్ 20: ప్రతి ఒక్కరికీ ఆర్థిక యాజమాన్యం అవసరమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్ అన్నారు. చిన్న మొత్తాల పొదుపు భవిష్యత్ ఆర్థిక తోడ్పాటునిస్తుందని చెప్పారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతలను లౌక్యంతో అధిగమించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.రామిరెడ్డి, కౌన్సిలర్ కేవీ బాబూరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.శ్రావణ్ కుమార్, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ ఐ.కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి రాత పరీక్ష

ఇల్లెందు రూరల్, నవంబర్ 20: ఇల్లెందు ఏరియాలోని షాంప్లింగ్ మజ్దూర్-3, డంప్‌మెన్, ట్రిప్‌మెన్-3 పోస్టుల భర్తీకి అధికారులు బుధవారం రాత పరీక్ష నిర్వహించారు. ఎస్ఓటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు గిరిధర్‌రావు, జీవీ మోహన్‌రావు, అంజిరెడ్డి, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన కరపత్రం..

టేకులపల్లి, నవంబర్ 20: సేవాలాల్ సేన యాత్ర ప్రచార కరపత్రాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ బుధవారం టేకులపల్లిలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, లాల్‌సింగ్, రవి రాథోడ్, శీను తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

ఇల్లెందు, నవంబర్ 20: మాదక ద్రవ్యాల నిర్మూలనపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఇల్లెందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ తాటిపాముల సురేష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.లక్ష్మణ్ రావు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తొర్తి జాన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

రైతులకు అండగా సొసైటీలు

టేకులపల్లి, నవంబర్ 20: రైతులకు సహకార పరపతి సంఘాలు (సొసైటీలు), బ్యాంకులు అండగా ఉన్నాయని జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ అన్నారు. స్థానిక బేతంపూడి సొసైటీలో చైర్మన్ లక్కినేని సురేందర్ రావు ఆధ్వర్యంలో జరిగిన సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఖుర్షీద్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, సేవే మార్గంగా రైతుల కోసం సహకార సంఘాలు పనిచేస్తున్నాయని అన్నారు. రైతులకు రుణాలు అందజేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాకేష్, డీసీసీబీ సిబ్బంది కనకదుర్గ, విజయ, సొసైటీ డైరెక్టర్లు లక్కినేని శ్యాంబాబు, దోర్నాల విజయ మోహన రావు, చీమల లక్ష్మినారాయణ, ఉదయ్ పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రం పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20: మండలంలోని గుంపెన సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఊటుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు బుధవారం పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ... ధాన్యం తేమ 17 శాతం లోపు ఉండాలన్నారు.

చెరువులోకి చేప పిల్లలు

టేకులపల్లి, నవంబర్ 20: మండలంలోని రోళ్ళపాడు పంచాయతీ చెరువులోకి గిరిజన సొసైటీ తరపున 66,000 చేప పిల్లలను ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం వదిలారు. డీటీ ముత్తయ్య, మత్స్య శాఖ అధికారులు, స్థానిక సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ఆళ్ళపల్లి, డిసెంబర్ 20: మండలంలోని లక్ష్మిపురం గ్రామస్తుడు పూనెం పాపయ్యకు, అనంతోగు గ్రామస్తురాలు కోరం వరలక్ష్మికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వాసం శ్రీకాంత్ పాల్గొన్నారు.

తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

అశ్వారావుపేట, నవంబర్ 20: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాల ప్రాంగణంలో బుధవారం తాత్కాలిక ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్ కార్మిక సంఘం నూతన కమిటీని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఉమారమేష్, సాలార్, కోశాధికారిగా ఇస్మాయిల్ ఎన్నికయ్యారు.

స్పోర్ట్స్ కిట్ అందజేత

అశ్వారావుపేట, నవంబర్ 20: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్పోర్ట్స్ కిట్‌ను లయన్స్ క్లబ్ జిల్లా బాధ్యుడు మాడిశెట్టి మదన్ మోహన్ అందించారు. ఇతర బాధ్యులు యూఎస్ ప్రకాశ్‌రావు, దూబగుండ్ల దుర్గారావు, బలుమూరి సూర్యారావు, కోటగిరి మోహన్‌రావు, కొఠారి చలపతిరావు, లక్కదాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన క